సాక్షి
శ్రీకాకుళం

సోమవారం : 8 : సెప్టెంబర్ : 2025



రుణ రక్కసి

సెల్‌ఫోన్‌లో రుణ రక్కసి భయపెడుతోంది. యువతకు వల వేస్తోంది.

- 8లో



సృజనాత్మకతకు వేదిక

విద్యార్థులకు మంచి అవకాశం వచ్చింది. ఉపకారవేతనానికి చాన్స్ లభించింది.

- 8లో

వంతెన పైపుల తొలగింపు

సోంపేట: ఉప్పలాం పంచాయతీ పరిధిలో ఉప్పటేరుపై వంతెన నిర్మాణం కోసం ఏడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణంలో భాగంగా ఉప్పటేరు నీరు ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా పైపులు వేశారు. అయితే చేపల వేట సరిగా సాగడం లేదని స్థానిక మత్స్యకారులు కొందరు ఇటీవల పైపులు ఊడదీశారు. దీంతో పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.



పుడమి నీడలో పున్నమి చంద్రుడు

పుడమి నీడలో పున్నమి చంద్రుడు చిన్నబోయాడు. సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా శుక్ల, కృష్ణ పక్ష సమయాలను ఒకే రోజు చూపించాడు. ఆదివారం రాత్రి గ్రహణ కాలం సందర్భంగా పల్లెల్లో సంప్రదాయాలు పాటించారు. మరికొందరు బయటకు వచ్చి గ్రహణ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

న్యూస్‌రీల్

అందుబాటులో 1600 మెట్రిక్ టన్నుల యూరియా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రస్తుతం 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం వెల్లడించారు. మరో వారం రోజుల్లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి విడత ఎరువులు వచ్చే అంచనా తేదీని గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి 1 ఎకరా భూమికి యూరియా 3 మోతాదులుగా వినియోగించాలన్నారు. ఒక్కో మోతాదుకు 25 కిలోల చొప్పున యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. యూరియా 3 విడతలుగా సరఫరా జరుగుతుందని వివరించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, తగినంత మోతాదులో వినియోగించేందుకు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు 9121863788 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల అడ్డగింత

- టీడీపీ నాయకుల నిర్వాకం



నిలుపుదల చేసిన యంత్రం

జలుమూరు: జోనంకిలో పారిశుద్ధ్య పనులు చేపట్టకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని సర్పంచ్ జీవీ రమణి ఆదివారం తెలిపారు. శనివారం కాలువల్లో పూడిక తీత, చెత్త సంపద కేంద్రంతోపాటు మిగతా చోట్ల పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు యంత్రాలు పెడితే వాటిని అడ్డుకొని అధికారుల మీద ఒత్తిడి తీసుకువచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా తాను తన బాధ్యత నిర్వర్తిస్తుంటే ఇదే పంచాయతీకి చెందిన కూన ధర్మారావు అనే వార్డు మెంబర్ 'మేం అధికారంలో ఉండగా.. మీరు ఎలా పనులు చేస్తారని' అంటూ అడ్డుకున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. దీనిపై ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల నిర్వహణ సర్పంచ్ బాధ్యత అని, అడ్డుకునే అధికారం ఎవరికీ లేదన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సంతబొమ్మాళి: యూరియా ఎరువుల వినియోగంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులకు అవగాహన కల్పించారు. ఆదివారం లక్ష్మీపురం గ్రామంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. ఒకే సారి ఎరువులను పంటలకు వినియోగించరాదని, మూడు దఫాలుగా ఎరువులు చల్లాలని రైతులను కోరారు. ఎరువుల వినియోగంపై రైతులు అపోహలు విడనాడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కె. కాంతారావు, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఏఓ అప్పారావు, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశాలకు సన్నద్ధం

ఎచ్చెర్ల: ఏపీ పీజీ సెట్-2025 పరీక్షలకు వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలను శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించి జూన్ 25న ఫలితాలు ప్రకటించింది. ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత చెందిన వారు వెబ్ ఆప్షన్ ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో సీట్లు పొందవచ్చు. ఆర్ట్స్ కళాశాలలో ఎంకాం, ఎంఏ (ఎకనామిక్స్), ఎంఏ (రూరల్ డవలప్ మెంట్), ఎంఈడీ, ఎంఎల్ఐఎసీ, ఎంఏ (సోషల్ వర్క్), ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ (తెలుగు), ఎంజేఎంసీ, ఎంఏ (తత్వశాస్త్రం)లకు ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. వర్సిటీ సైన్స్ కాలేజీలో ఎంఎస్సీ (బయోటెక్నాలజీ), ఎంఎస్సీ (మైక్రోబయాలజీ), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్సీ (అనలటికల్ కెమిస్ట్రీ), ఎంఎస్సీ (మ్యాథమెటిక్స్), ఎంఎస్సీ (అప్లయిడ్ మేథమెటిక్స్), ఎంఎస్సీ (ఫిజిక్స్) ఎంఎస్సీ (జియోఫిజిక్స్), ఎంఎస్సీ (జియాలజీ)లకు ఏపీ పీజీసెట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చు. మరిన్ని వివరాలకు 'సీఈటీఎస్. ఏపీఎస్‌సిహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడవచ్చు. వెబ్ కౌన్సిలింగ్‌కు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపులకు ఈ నెల 8 నుంచి 15 వ తేదీ వరకు గడువు ఉంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 9 నుంచి 16 వరకు, వెబ్ ఆప్షన్ల ఎంట్రీ 12 నుంచి 17 వరకు చేసుకోవచ్చు. 18వ తేదీన వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఇచ్చారు. 20న సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. సెల్ఫ్ జాయినింగ్‌లు 22 నుంచి 24 వతేదీ వరకూ జరుగుతాయి.

సేవలకు 'స్కోచ్'

వేతనం తూచ్..!

- బీసీ స్టడీ సర్కిల్ సేవలకు స్కోచ్ అవార్డు
- వేతనం కోసం ఎదురు చూపుల్లో ఫ్యాకల్టీ
- స్కోచ్ అవార్డు తెచ్చిన స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీకి తీవ్ర నిరాశ
- అవార్డు ప్రభుత్వానికి ప్రతిష్ట
- ఫ్యాకల్టీకి మాత్రం ఆర్థిక కష్టాలు



శ్రీకాకుళం నగరంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ భవనం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

గ్రూప్-2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించింది బీసీ స్టడీ సర్కిల్. ఈ శిక్షణతో అనేక మంది అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించగా, ఆ విజయానికి గుర్తింపుగా బీసీ స్టడీ సర్కిల్ సేవలకు గాను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖకు తాజాగా స్కోచ్ అవార్డు లభించింది. ఫ్యాకల్టీ సభ్యులు శ్రమించి, విద్యార్థులను విజయం వైపు నడిపించారు. అయితే ఈ విజయానికి బలమైన పునాది వేసిన ఫ్యాకల్టీ సభ్యులు మాత్రం నిరాశలో మునిగిపోయారు. నెలల తరబడి బోధించినా ఇప్పటికీ వారికి జీతాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ కష్టానికి అవార్డు రావడం తమకు గర్వకారణమే గానీ ఆ అవార్డు కడుపు నింపదని వాపోతున్నారు.

270 మంది ఫ్యాకల్టీకి జీతాల్లేవు..

15 నెలల క్రితం గ్రూప్-2 మెయిన్స్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా 70 మంది ఫ్యాకల్టీతో అభ్యర్థులకు శిక్షణ ఇప్పించింది. ఒక్కో పీరియడ్‌కి రూ.1000 చొప్పున ఇస్తామని చెప్పింది. దీంతో ఫ్యాకల్టీ అభ్యర్థులకు బోధించడం జరిగింది. వారికి ఇంతవరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా స్టడీ సర్కిల్స్ ద్వారా 200 మంది ఫ్యాకల్టీ ద్వారా 10 నెలల కిందట డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఒక్కో పీరియడ్‌కి రూ. 600 చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇంతవరకు వారికి జీతాలు విడుదల చేయలేదు.

ఫ్యాకల్టీని విస్మరించిన ప్రభుత్వం

ప్రతిభకు గుర్తింపుగా ఇటీవల బీసీ స్టడీ సర్కిల్‌కు స్కోచ్ అవార్డు లభించింది. ఇది సంస్థ ప్రతిష్టను పెంచింది. కానీ స్కోచ్ అవార్డు రావడానికి మూల కారణమైన ఫ్యాకల్టీ సభ్యులు మాత్రం బకాయి వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి బోధించినా ఇప్పటివరకు వారికి జీతాలు అందలేదు. ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వకపోతే అది వారిలో విశ్వాసం దెబ్బ తీయడమే అవుతుందని వాపోతున్నారు. మొత్తానికి విద్యార్థుల విజయాలకు గుర్తింపు వచ్చింది. కానీ బోధించిన ఉపాధ్యాయులకు బకాయి వేతనాలే మిగిలాయి.

కూటమి ప్రభుత్వంలో ఫ్యాకల్టీకి జీతాల్లేవు

ఆంధ్రా, తెలంగాణలో పలు పోటీ పరీక్షలకు తెలుగు, ఎకనామిక్స్ సబ్జెక్టులు బోధించడం జరిగింది. బీసీ స్టడీ సర్కిల్స్‌లో గత పదేళ్లుగా ఎకనామిక్స్‌తో పాటు తెలుగు సబ్జెక్ట్‌లో బోధిస్తూ వస్తున్నాం. ఇప్పటివరకు ఎప్పుడూ జీతాల సమస్య లేదు. గ్రూప్-2, డీఎస్సీ శిక్షణ రెమ్యునరేషన్ మాత్రమే జాప్యమవుతూ వచ్చింది. గ్రూప్-2కు సంబంధించి గత ప్రభుత్వంలో జరిగిన ప్రిలిమినరీ శిక్షణా రెమ్యునరేషన్ విడుదలైంది. ఈ ప్రభుత్వం వచ్చాక మెయిన్స్‌కు సంబంధించి జీతాలు విడుదల చేయలేదు. అలాగే, డీఎస్సీ శిక్షణకు సంబంధించి కూడా జీతాలు రాలేదు. స్కోచ్ అవార్డు రావడం సంతోషమే. కానీ, జీతాలు రాకపోతే ఆ ఆనందం కడుపు నింపదు.

– జి.రాంబాబు, బీసీ స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీ

ప్రభుత్వానికి బిల్లులు పెట్టాం

జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చిన ఫ్యాకల్టీ జీతాలకు సంబంధించి ప్రభుత్వానికి బిల్లులు పెట్టడం జరిగింది. అక్కడి నుంచి వచ్చిన వెంటనే చెల్లింపులు చేస్తాం. బోధించిన ఫ్యాకల్టీకి తప్పకుండా జీతాలు వస్తాయి.

– ఇ.అనురాధ, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి, శ్రీకాకుళం.

గ్రహణ కాలం



గార: శ్రీకూర్మం ఆలయం ప్రధాన ద్వారాలను మూసివేస్తున్న దృశ్యం



అరసవల్లి ఆలయ ప్రధాన తలుపులు మూస్తున్న ప్రధానార్చకులు శంకరశర్మ, ఈఓ ప్రసాద్ తదితరులు

చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నమే మూసివేశారు. గ్రహణ మోక్ష కాలం పూర్తయ్యాక శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం మళ్లీ ఉదయం దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు.



జలుమూరు: శ్రీముఖలింగం ప్రధాన ఆలయానికి తాళాలు వేస్తున్న అర్చకులు



టెక్కలి : ఎండల మల్లన్న దేవస్థానానికి తాళాలు



టెక్కలి : మూసివేసిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయం

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి : సూర్యనారాయణ స్వామిని ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. చంద్ర గ్రహణం కారణంగా ఉదయం 5.30 గంటల నుంచే సర్వదర్శనాలను ప్రారంభించి, మధ్యాహ్నం 2 గంటల వరకు దర్శనాలు చేయించారు. ఈ మేరకు ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకే ఆలయ తలుపులు మూసివేయడంతో అన్నప్రసాదాలను, ప్రసాదాల విక్రయాలను మధ్యాహ్నం ఒంటి గంటలోపే ముగించారు.

రైతు సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎరువులపై రైతుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేకంగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య 08942-222565 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చు. సమస్యలను వెంటనే పరిష్కరించడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతుకు న్యాయం చేయాల్సిందే



సోంపేటలో అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

- 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు

సోంపేట : కూటమి ప్రభుత్వం దిగి వచ్చి రైతులకు న్యాయం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎరువుల కష్టాలు తెలియజేసేందుకు ఈ నెల 9న పలాసలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆదివారం సోంపేటలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. అధికారులకు, నాయకులకు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు అన్నదాత పోరు కార్యక్రమం రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో రైతులకు ఇలాంటి కష్టాలు లేవని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లో సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చి రైతులకు న్యాయం చేయడం కోసమే రైతుల తరపున పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ రైతులు అధిక ధరకు యూరియా కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటే దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం మాని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, కడియాల ప్రకాష్, తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు, పూడి నేతాజీ, బతకల మోహనరావు, గుర్రాల శ్రీను, కారింగి మోహన రావు, శిలగాన భాస్కరరావు, పాతిర్ల రాజశేఖరరెడ్డి, బుద్దాన శ్రీకృష్ణ, దుర్గాసి దర్మారావు, బెందాళం శోభన్‌బాబు, కొనపల సురేష్, గుమ్మడి రాందాస్, నర్తు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలక వర్గానికి రక్ష..

సామాన్యులపై కక్ష

ఇసుక అక్రమంగా తరలించడం తప్పు కాదు.. కానీ ఆ నిజాన్ని బయటకు చెబితే తప్పు. రోడ్డు వేయకపోవడం తప్పు కాదు.. కానీ రోడ్డు బాగోలేదంటే నేరం. క్వారీల్లో యథేచ్ఛగా పేలుళ్లు జరపడం తప్పు కాదు.. దానిపై ఫిర్యాదు చేయడం మాత్రం ఘోరమైన తప్పిదం.. జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా అమలు చేస్తున్న వింత నిబంధనలివి. ఖాకీలు సైతం ఈ రాజ్యాంగాన్నే అనుసరించాల్సి వస్తోంది. ఫలితంగా అక్రమాలు చేస్తున్న నాయకులు దర్జాగా తిరుగుతుండగా.. ఫిర్యాదు చేసే బాధితులు మాత్రం కక్షలకు గురవుతున్నారు.

- విస్తుగొలుపుతున్న ఖాకీల వైఖరి
- టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న వైనం
- ఫలితంగా అమాయకులకు వేధింపులు
- ఎస్పీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా తీరు మారని పోలీసులు




శ్రీకాకుళం క్రైమ్ :

మొన్నటికి మొన్న ఎచ్చెర్లలో.. నిన్నటికి నిన్న కొత్తూరులో.. నేడు సంతబొమ్మాళిలో రెడ్‌బుక్ పడగ నీడలు ప్రస్ఫుటంగా కనిపించాయి. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో వైఎస్సార్ సీపీ వర్గీయులను పోలీసులు టార్గెట్ చేస్తున్న వైనాలు ఎప్పటికప్పుడు తారసపడుతూనే ఉన్నాయి. అధికార టీడీపీ నాయకులు ఏం చెబితే అదే ఫిర్యాదుగా రాసుకుంటుండడంతో సామాన్యుడు స్టేషన్ మెట్లు ఎక్కాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి దాపురించింది. తమకు జరుగుతున్న అన్యాయాలపై నేరుగా కొంతమంది ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యమే.

ఎస్ఐ కాలితో తన్నారు..

ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామానికి చెందిన నక్క దామోదరావు అనే వైఎస్సార్ సీపీ సాధారణ కార్యకర్త ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని ఇదే ఏడాది జూన్ 30న కలిసి ఎచ్చెర్ల ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. మే 16న గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమ పొలంలోకి దౌర్జన్యంగా ట్రాక్టర్ తేవడంతో తన కుటుంబీకులు అడిగారని, వెంటనే తనతో పాటు తన కుటుంబ సభ్యులపై కర్రలతో దాడిచేసి హత్యాయత్నానికి ఒడిగట్టారని, ఇదే విషయం ఎచ్చెర్ల ఎస్ఐకు ఫిర్యాదు చేయగా తిరిగి తనపై కేసు కట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై నేరుగా స్టేషన్‌కు వెళ్లి అడిగితే దివ్యాంగుడిని అని కూడా చూడకుండా కాలితో తన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఫరీద్‌పేట వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్యకేసులో కూడా ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరించారంటూ.. గ్రామస్తులు మృతదేహం ఉన్నచోటకు ఆయనను రానివ్వలేదు.



మరెన్నో ఘటనలు..

- రోడ్డులో నాణ్యత గురించి ప్రశ్నించినందుకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు అనుచరులు తనపై హత్యాయత్నం చేశారని, అక్కడి పోలీసులు పట్టించుకోకపోవడంతో ఎస్పీకి నేరుగా కలసి ఫిర్యాదు చేశారు నాయుడుగారి రాజశేఖర్ అనే వ్యక్తి. రాష్ట్రపతి సచివాలయ కార్యాలయం, నేషనల్ హ్యూమన్‌రైట్స్‌కు సైతం ఫిర్యాదు చేయడం గమనార్హం.
- ఏడాది కావస్తున్నా బలగమెట్టులో తనపై జరిగిన దాడిపై ఇప్పటికీ పోలీసులు చార్జిషీటు నమోదు చేయలేదని బూర్జ మండలం గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్ ఆవేదన చెందుతున్నాడు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి ఇసుక అక్రమాలు చేస్తున్నారని ప్రశ్నించినందుకే తనపై అతని అనుచరులు దాడికి ఎగబడ్డారని బాధితుడు పేర్కొనడం విశేషం.

పేలుళ్ల గురించి చెబితే..

ఈ ఏడాది మేలో పాతపట్నం దీనబంధుపురంలో గ్రానైట్ క్వారీలో భారీ పేలుడు సంభవించి ముగ్గురు కార్మికులు చనిపోయారు. ఇలాగే కొత్తూరు మండలం శోభనాపురంలో కొండపై ప్రమాదకరకమైన పేలుళ్లతో క్వారీయింగ్ చేయడం వల్ల తమ పొలాల్లోకి రాళ్లు వస్తున్నాయని ఓ యువకుడు క్వారీ వద్దకు వెళ్లి అడగడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎవరి ఒత్తిళ్లో గానీ ఆ యువకుడిని మరుసటి రోజు కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ చావగొట్టారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు విచక్షణారహితంగా చితగ్గొట్టారు. రిమ్స్‌లో ఆగస్టు 6న యువకుడిని చేర్పించిన కుటుంబ సభ్యులు ఆధారాలతో సహా ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. ఇటీవలే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సంబంధిత ఎస్ఐను జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్ చేస్తూ వీఆర్‌కు పంపారు.

తాజాగా సంతబొమ్మాళిలో..

వరుసగా పోలీసులపై ఇలాంటి ఆరోపణలు వస్తుండటం, రుజువవుతుండటంతో ఎస్పీ సైతం ఇటీవల దాదాపు ఆరుగురు ఎస్ఐలను వీఆర్ పంపారు. అయినప్పటికీ వారిలో మార్పు రాకపోగా టీడీపీ నాయకుల ఆదేశాలే తమకు ముఖ్యమన్నట్లు రెచ్చిపోతున్నారు. ఇటీవల సంతబొమ్మాళి మండలం మూలపేటలో సర్పంచ్ జీరు బాబూరావు తమ్ముడు జీరు విశ్వనాథం తన రొయ్యల చెరువులో పనిచేస్తుండగా నౌపడ ఎస్ఐ ఐ.నారాయణస్వామి వెళ్లి దాడికి పాల్పడ్డారు. గ్రామానికి సంబంధించిన నిధుల వినియోగం విషయంలో టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీస్‌స్టేషన్‌కు తనను రమ్మన్నారని, తుఫాను, వర్షాల వల్ల రొయ్యలకు నష్టం జరిగే పరిస్థితి ఉండటంతో చెరువు దగ్గర పనిచూసుకుని వస్తానని చెప్పినా వినిపించుకోకుండా ఎస్ఐ దాడికి పాల్పడ్డారని బాధితుడు చెప్పడం గమనార్హం.

క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

శ్రీకాకుళం: జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయ్ కుమారి, బి.విలియమ్స్ నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా పైడి రామస్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె.సంపత్ కుమార్, కోశాధికారిగా కె.చంద్రరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి ఉపాధ్యక్షుడిగా పి.కృష్ణారావులు ఎన్నికయ్యారు. సంఘం పూర్వ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా, బాల బ్రహ్మానంద, బాపూజీ, అన్నాజీరావులు కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవ్వడానికి కృషి చేశారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

హౌసింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

నరసన్నపేట: జిల్లాలో పనిచేస్తున్న ఏపీ గృహనిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (జేఏసీ) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించినట్లు నరసన్నపేట ఏఈ, ఏఈల సంఘ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా గొల్లంగి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొల్లంగి యువరాజు, సబ్ డివిజన్ జనరల్ కార్యదర్శిగా కీర్తి అప్పలనాయుడు, ట్రెజరర్‌గా సారి సంతోష్‌లను ఎన్నుకున్నారు. మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూనియన్‌లో గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఎంఐసీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈఓలు భాగస్వాములుగా ఉంటారని పేర్కొన్నారు.

డీజే నిషేధిస్తూ తీర్మానం



మాట్లాడుతున్న కపాసుకుద్ది పెద్దలు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది పంచాయతీ కె.కపాసుకుద్దిలో డీజే సౌండ్ సిస్టం నిషేధిస్తూ గ్రామాభివృద్ధి కమిటీ ఆదివారం తీర్మానం చేసింది. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎటువంటి సందర్భంలోనూ గ్రామంలో డీజే పెట్టడానికి వీలులేదని, తీర్మానాన్ని ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తోట ధర్మరాజు, పులకల శ్రీరాములు, కిమ్మోజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రకాష్ కపిల

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్ కపిల అన్నారు. నగరంలోని ఇల్లీసుపురం అంబేడ్కర్ విజ్ఞానమందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవాళి మనుగడను శాసించేది పర్యావరణమేనన్నారు. ఇటీవల దేశంలో జరుగుతున్న పర్యావరణ ధ్వంసంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కనువిప్పు కావాలన్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు పంచాది రాంబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూడు రోజులుగా లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం, ఆమదాలవలస, సంతకవిటి, పొందూరు తదితర మండలాల్లో 15000 టేకు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశామని వివరించారు. సమావేశంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐతమ్‌కు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో 201 నుంచి 300 బాండ్ ర్యాంకింగ్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి విభజించిన ర్యాంకుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వచ్చిన మూడు కళాశాలలో ఐతమ్ కళాశాల స్థానం దక్కినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 8 కళాశాలలు ఈ ర్యాంకింగ్‌లలో ఉండగా, అందులో ఐతమ్ ఒకటని తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిభ, ఉపాధి అవకాశాలు, అధ్యాపకుల పరిశోధనలు, ఆధునిక ల్యాబ్ సదుపాయాల ప్రాతిపదికన ఈ ర్యాంక్‌లు ఎంపిక చేస్తారని చెప్పారు.

సెల్‌ఫోన్‌లో... రుణ రక్కసి..!



చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ఎటువంటి ష్యూరిటీ లేకుండానే క్షణాల్లో రుణం పొందవచ్చని ఆశ చూపుతారు. యాప్ డౌన్‌లోడ్ చేసి క్లిక్ చేస్తే ఇక అంతే సంగతులు. చేతికొచ్చే నగదు ఖర్చు చేసేలోపే యాప్ నిర్వాహకుల నుంచి ఫోన్ల మోత మొదలవుతుంది. వడ్డీ కట్టాలని వేధిస్తూ బూతులతో రెచ్చిపోతారు. కడతామని చెప్పినా.. వాళ్ల కర్కశం ఆగదు. మనకు తెలియకుండా డేటా చోరీ చేసి ఫేక్ నగ్న ఫొటోలను కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లకు పంపే దుశ్చర్యకు పాల్పడతారు. ఇలా ఉక్కిరిబిక్కిరి చేసి మన పరువు తీసే వ్యూహానికి ఒడిగడతారు. వారి ఆగడాలకు బలైపోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. అందుకే రుణ రక్కసి వలలో చిక్కకుండా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

- లోన్ పేరుతో యువతకు యాప్‌ల వల
- ష్యూరిటీ లేకుండానే అప్పులు
- ఆపై అధిక వడ్డీల కోసం వేధింపులు
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

హిరమండలం: పెరుగుతున్న టెక్నాలజీని కొందరు కేటుగాళ్లు ఉపయోగించుకుంటూ అమాయకులకు గాలం వేస్తున్నారు. ష్యూరిటీ లేకుండానే రుణం అని చెప్పి ఆకర్షిస్తున్నారు. అలా ప్రైవేటు యాప్‌ల ద్వారా రుణం తీసుకున్న తర్వాతే అసలు కథ మొదలవుతుంది. తీసుకున్న నగదు కంటే వడ్డీకి వడ్డీ వేసి అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ఫేక్ నగ్న వీడియోలు వైరల్ చేస్తామని బ్లాక్ మెయిల్‌కు దిగుతారు. వారి టార్చర్ తట్టుకోలేక కొందరు లోలోపలే కుంగిపోతుంటే.. మరికొంతమంది ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. అందువలన ప్రైవేటు యాప్స్‌లో రుణాలు తీసుకుని మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అనేకమంది బాధితులు

మీ సెల్‌ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ రుణయాప్ నిర్వహకులు ఇచ్చే ప్రకటనలతో కొందరు వెంటనే డౌన్‌లోడ్ చేసేస్తున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్ వలలో చిక్కితే బయటపడడం అసాధ్యం. ఇలా యాప్‌ల బారిన పడినవారు జిల్లాలో అనేక మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. లోన్‌యాప్స్ నిర్వహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు. మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునే వరకు ఫోన్ చేసి, ఏదోవిధంగా ఒప్పించి రుణం తీసుకునేలా చేస్తారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే చుక్కలు చూపిస్తున్నారు.

హిరమండలానికి చెందిన ఒక వ్యాపారి కుమారుడు లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. అయితే అతను సక్రమంగా చెల్లించకపోవడంతో యాప్ నిర్వహకులు గ్రామంలోని ఒకరికి ఫోన్‌చేసి మీరు ష్యూరిటీ పెట్టారు కదా చెల్లించండని వేధించారు. విసిగిపోయిన ఆయన మీ మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.. అని గట్టిగా చెప్పడంతో అప్పటినుంచి ఫోన్ కాల్స్ రావడం లేదు. ఇలాంటి బాధితులు గ్రామాల్లో ఎంతోమంది ఉన్నారు. బయటకు చెప్పకోలేక కుమిలిపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లవద్దు. అదేవిధంగా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని అడిగినా చెప్పవద్దు. ప్రతీ యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణయాప్‌లో అప్పులు తీసుకుని మెసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లోన్‌యాప్ నిర్వాహకుల నుంచి ఎటువంటి వేధింపులు వచ్చినా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సీహెచ్ ప్రసాద్, సీఐ, కొత్తూరు

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మెబైల్‌కు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపుతారు. బెదిరింపులను లెక్క చేయకపోతే రుణం తీసుకున్నవారి కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సప్‌కు పంపుతారు. వీరి ఆగడాలు కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపైనే కన్నేశారు.

చినుకు పడితే వణుకే..



కంచిలి మెయిన్‌రోడ్డులో వర్షపు నీరు

కంచిలి/నరసన్నపేట : చిన్నపాటి వర్షమొచ్చినా కంచిలి మెయిన్‌రోడ్డు చెరువులా మారుతోంది. పూర్తిస్థాయిలో డ్రైనేజీ లేకపోవడం, కొన్నిచోట్ల పూడికలతో నిండిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డంతా జలమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. నరసన్నపేట మేజరు పంచాయతీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజ్ స్తంభించడంతో వీధుల్లోకి వర్షం నీరు, మురుగు నీరు వచ్చింది. గడ్డెయ్య చెరువు సమీపంలో శివనగర్ కాలనీ తదితర వీధుల్లో ఇళ్లల్లోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నరసన్నపేటలో ఇంట్లోకి వచ్చిన నీటిని తోడుతున్న సర్వమ్మ

జీవనాధారం కూల్చేశారు



కూరగాయల కాంప్లెక్స్ ను కూల్చివేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఎంతో మంది ఫుట్‌పాత్ వ్యాపారులకు ఆసరాగా ఉన్న మహాత్మాగాంధీ కూరగాయల కాంప్లెక్స్‌ను ఆదివారం కూల్చేశారు. రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాల్లో భాగంగా అరటిపళ్లు, ఇతర కూరగాయలు అమ్మకాలు చేసుకునే వారి కోసం 23 ఏళ్ల క్రితం అప్పటి సర్పంచ్ టంకాల పావనిరాణి నేతృత్వంలో ఈ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఎంతో మంది వీధి విక్రయదారులకు ఈ కాంప్లెక్స్ ఆసరాగా నిలిచింది. ఇప్పుడు దీనిని కూల్చివేయడంతో చిరువ్యాపారులు రోడ్డున పడే దుస్థితి ఏర్పడింది.

ఆర్ట్స్ కాలేజీ టు ఐఎన్‌ఎస్‌ఏ..

- ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ విజిటింగ్ సైంటిస్ట్‌గా డాక్టర్ ప్రదీప్
- దేశవ్యాప్తంగా ఎంపికైన శాస్త్రవేత్తలు, లెక్చరర్ల జాబితాలో చోటు
- జిల్లా నుంచి ఎంపికైన మొదటి వ్యక్తిగా గుర్తింపు



అంతర్జాతీయ స్థాయి సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మదమంచి ప్రదీప్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్‌ఎస్‌ఏ) విజిటింగ్ సైంటిస్ట్‌గా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అప్లయిడ్ సైన్సెస్ హెచ్‌ఓడీ డాక్టర్ మదమంచి ప్రదీప్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఐఎన్‌ఎస్‌ఏ నుంచి వర్తమానం అందుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన ఐఎన్‌ఎస్‌ఏ ఏటా కొందరు శాస్త్రవేత్తలు, అధ్యాపకులను దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలైనా ఐఐటీ, ఐఐఎస్‌ఈఆర్, నిట్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది. ప్రతిభ ఆధారంగా విజిటింగ్ సైంటిస్టులను ఎంపిక చేస్తుంది. ఈ క్రమంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా 70 మంది శాస్త్రవేత్తలు, లెక్చరర్లను ఐఎన్‌ఎస్‌ఏ ఎంపికచేయగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి చోటు లభించింది. ఆ జాబితాలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన అప్లయిడ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్ ఒకరు. ఈయనతో పాటు మైలవరంలోని బోటనీ లెక్చరర్ జి.రాముడుకు అవకాశం లభించింది. తిరుపతిలో ప్రఖ్యాత విద్యాసంస్థ ఐఐఎస్‌ఈఆర్ వేదికగా నెలరోజుల పాటు పరిశోధన కార్యకలాపాలలో ప్రదీప్ భాగస్వామ్యం కానున్నారు.

ప్రదీప్ సారథ్యంలో..

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ రిఫ్రెషర్ కోర్సులను 2021, 2022 రెండు సంవత్సరాల్లో నిర్వహించారు. 50 మంది లెక్చరర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్)లను అమలుపర్చగలిగారు. సెర్బ్ యాగ్జిలిలేటెడ్ విజ్ఞాన్ పథకంలో భాగంగా ఏడు రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహించారు. డీబీటీ సౌజ్యంతో ఎన్నో సెమినార్‌లు, వర్క్‌షాప్‌లు, సైన్స్, అకాడమీల లెక్చరర్ల రిఫ్రెసెస్, డీఎస్టీ ఇన్‌స్పైర్ క్యాంప్స్, సైన్స్ ఎగ్జిబిషన్లు తదితర యాక్టివిటీలను నిర్వహించారు. కళాశాలకు ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు మంజూరయ్యేలా చేశారు. యూజీసీ-ఎన్‌ఎస్‌క్యూఎఫ్ ద్వారా ఆక్వా కల్చర్‌పై మూడు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించారు. పీసీఆర్ టెస్టులపై వర్క్‌షాప్, సర్టిఫికెట్ కోర్సులను అందించారు. డీబీటీ, యూజీసీ, సెర్బ్, రూసా రీసెర్చ్ ప్రాజెక్టులు చేశారు. యూజీ, పీజీ బయోటెక్నాలజీ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వివిధ కంపెనీలు, లేబరేటరీలు, హాస్పిటల్స్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నారు. మరో ఏడు ఇండియన్ పేటెంట్స్, ఒక జర్మన్ పేటెంట్‌ను అందుకున్నారు. ఆరు బెక్‌చాప్టర్స్, స్కోపస్‌లో ఇండెక్స్‌లో నమోదైన 15 అంతర్జాతీయ పరిశోధనా పత్రాలను ప్రచురించారు. తాజాగా 9,10, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను పరిశోధనలవైపు ఆకర్షితులను చేసేందుకు 'ప్రయాస్' పేరిట ప్రత్యేక పథకాన్ని కొనసాగిస్తున్నారు. వీటిన్నింటిని ఆధారంగా చేసుకుని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్‌ఎస్‌ఏ) విజిటింగ్ సైంటిస్ట్‌గా ఎంపికచేశారు. 2022లో సెప్టెంబర్ 5న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు సైతం అందుకున్నారు. ఈయన స్వస్థలం నెల్లూరు జిల్లా చేజర్ల మండలం కాకివాయ గ్రామం. ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలోని విశాఖ-బి కాలనీలో నివాసముంటున్నారు. తల్లిదండ్రులు నరసింహ, ప్రమీల.


కళాశాలకు గర్వకారణం



కళాశాలలో నిర్విరామంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు, సెమినార్‌లు, వర్క్‌షాప్‌లు, రిసోర్స్ ప్రోగ్రాంలు, ఓరియంటేషన్ కార్యక్రమాలతో విద్యార్థుల ఉన్నతికి, వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్న డాక్టర్ ప్రదీప్ కళాశాలకు గర్వకారణంగా నిలుస్తున్నారు. కళాశాలకు ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు కేటాయింపులో విశేష కృషి చేశారు.

–డాక్టర్ శ్రీరాములు, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)

సంతోషంగా ఉంది



విజిటింగ్ సైంటిస్ట్ పథకం ద్వారా పరిశోధన సామర్థ్యం ఉన్నప్పటికీ అందుకు తగిన అవకాశాలు లేని అధ్యాపకులు, శాస్త్రవేత్తలు పరిశోధన చేయటానికి వీలుపడుతుంది. కార్యక్రమంలో భాగంగా ఔషధ నిరోధక మూర్ఛరోగాలలో జీవ అణు అధ్యయనాలను రీసెర్చ్ చేయనున్నాం. దేశ్యాప్తంగా 70 మంది శాస్త్రవేత్తలు, లెక్చరర్ల జాబితాలో చోటులభించినందుకు సంతోషంగా ఉంది.

– డాక్టర్ ప్రదీప్, హెచ్‌ఓడీ

సృజనాత్మకతకు వేదిక..

విద్యార్థి విజ్ఞాన్ మంథన్

- స్కాలర్‌షిప్ పరీక్షకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు అర్హులు
- ఎంపికైన వారికి నెలకు రూ.2000 చొప్పున ప్రోత్సాహకం
- సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తులకు గడువు

2025 - 26

శ్రీకాకుళం: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (సైన్స్ టాలెంట్ సెర్చ్).. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించే ప్రతిభా పరీక్ష. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు చదివే విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. ఇందులో ప్రతిభ కనబరిస్తే డీఆర్‌డీఓ, ఇస్రో, బీఏఆర్‌సీ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం లభిస్తుంది. దీనికి అదనంగా ప్రతి నెలా రూ.2000 చొప్పున ఏటా రూ.24 వేలను ప్రోత్సాహకంగా అందిస్తారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో పరీక్ష రాసే సౌలభ్యం ఉంది. పాఠశాల స్థాయిలో ఎంపికైతే రాష్ట్రస్థాయికి తరగతుల వారీగా 150 మందిని ఎంపిక చేసి పంపిస్తారు. అక్కడ ప్రతిభ చూపిన వారికి ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి జాతీయస్థాయిలో జరిగే పరీక్షలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచేవారికి రూ.5000, రూ.2000, రూ.1000, సర్టిఫికెట్లను అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి రూ.25 వేల నగదు బహుమతి ఏడాది పాటు ఉపకార వేతనం అందజేస్తారు. జాతీయస్థాయిలో ఎంపికై న విద్యార్థులకు 20 రోజులు పాటు పేరొందిన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 28 నుంచి 30 మధ్య ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

విద్యార్థులకు ఉపయోగకరం



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష విద్యార్థులకు ఉపయోగకరం. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతుంది. ఉన్నత విద్యకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇంటర్న్‌షిప్ వల్ల ఉద్యోగం త్వరగా పొందే అవకాశం కలుగుతుంది.

– ఏ.పున్నయ్య, విద్యార్థి విజాన్ మంథన్ జిల్లా కో ఆర్డినేటర్

యూరియా కోసం రైతుల పాట్లు



యూరియా కోసం సచివాలయంలో ఉన్న రైతులు

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. ఆదివారం ఉర్లాం, కోమర్తిలో పోలీసు బందోబస్తు మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి సూర్యకుమారి, డీటీ పి.శ్రీనివాసరావులు దగ్గరుండి రైతులకు పంపిణీ చేశారు. ఒక్కసారి యూరియా కోసం రైతులు అధిక సంఖ్యలో రావడంతో కొద్ది సమయం ఉద్రిక్తత నెలకొంది.

విద్యారంగ సమస్యలపై రణభేరి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

శ్రీకాకుళం: పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి జాతా విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని చెప్పారు. మూడు నెలలుగా ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాలు లేవన్నారు. మూడో వంతు ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్ల స్కూల్‌గా మారిపోయాయని, సగంపైన హైస్కూల్స్ సింగిల్ సబ్జెక్టు టీచర్లుగా తయారయ్యాయని, హైస్కూల్లో పనిచేయాల్సిన స్కూల్ అసిస్టెంట్లను సర్ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు వినియోగించడం తగదన్నారు. పీఆర్ కమిషన్ వెంటనే నియమించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాషరావు, టి.వి.టి.భాస్కరరావు, బి.శంకరరావు, ఎం.వి.రమణ, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి, బి.గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలిని సస్పెండ్ చేసిన హైకోర్టు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాన్ని హైకోర్టు సస్పెండ్ చేసిందని ఆలయ వంశపారంపర్య శాశ్వత ధర్మకర్త పాట్నూరు వీరభద్రస్వామి ఆదివారం తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 12న ప్రభుత్వం స్థానిక వేంకటేశ్వరాలయానికి పాలకమండలిని నియమించిందని చెప్పారు. తనకు తెలియకుండా ఈ ప్రక్రియ చేపట్టడంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో పాలక వర్గాన్ని సస్పెండ్ చేస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

50 సెంట్ల భూమి తెమ్మని వేధించేవారు



డీఎస్పీ ఎదుట విలపిస్తున్న తల్లిదండ్రులు

ఆమదాలవలస: చిట్టివలసలో పురుగు మందు తాగి పూర్ణ అనే గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వివాహిత తల్లిదండ్రులు సింహాచలం, పద్మ మాట్లాడుతూ తమ కుమార్తె పెళ్లి సమయంలో కట్నం కింద రూ.5లక్షల నగదు, ద్విచక్ర వాహనం, రూ.2 లక్షల సారె సమకూర్చినా మరో 50 సెంట్ల భూమి తీసుకురావాలని అత్తింటి వారు నిత్యం వేధించేవారని వాపోయారు. పెళ్లయిన నాలుగు నెలలకే ఇలాంటి పరిస్థితి రావడం దారుణమన్నారు. వరకట్న వేధింపుల కారణంగా తమ కుమార్తె మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకుందని వివరించారు. విచారణలో ఎస్సై సనపల బాలరాజు, సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం: జాడ పంచాయతీ ముక్కపేట గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తాలాడ వెంకటరావు(40) విద్యుత్ షాక్‌కు గురై ఆదివారం మృతి చెందాడు. పంట పొలం వద్ద మరమ్మతులు చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కే సమయంలో షాక్‌కు గురవ్వడంతో అక్కడికక్కడే మత్యువాతపడ్డాడు. ఇతన జాడ, ముషినివలస, సర్వేశ్వరపురం, ముక్కపేట, రౌతుపేట గ్రామాల్లో ప్రయివేట్‌గా విద్యుత్ పనులు చేస్తుండేవాడు. వెంకటరావు మరణవార్త వినగానే భార్య ఉమామహేశ్వరి, పిల్లలు యోగి, ఉపేంద్రలు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావు వావెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.